
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

సోమవారం 24 జూన్ 2024

వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లా పనిచేశారు

- ఆదివాసీలను తప్పుదోవ పట్టించారు..
- టీడీపీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

- 6లో



ఒకేసారి రెండు పరీక్షలు!

ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారుల తీరిది

- జూలై 31, ఆగస్టు ఒకటి, రెండు, మూడు తేదీల్లో బీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు
- జూలై 30 నుంచి ఆగస్టు 8 మధ్య ఎమ్మెస్సీ దూర విద్య ఎగ్జామ్స్
- రెండింటికీ ఎలా హాజరుకావాలో తెలియక విద్యార్థుల్లో అయోమయం



విశాఖపట్నం, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారుల తీరు ఎప్పుడూ వివాదాస్పదంగానే ఉంటోంది. గత ఐదేళ్లుగా వారు తీసుకున్న అనేక నిర్ణయాలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తాజాగా విడుదల చేసిన పరీక్షల షెడ్యూల్‌తో వివిధ కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఒకేసారి రెండు పరీక్షలకు హాజరుకావాల్సిన పరిస్థితిని కల్పించాయి. దీంతో ఏంచేయాలో తెలియక వారంతా తలలుపట్టుకుంటున్నారు. అధికారుల నిర్వాకంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీఈడీ, దూర విద్యలో ఎమ్మెస్సీ పరీక్షలను వచ్చే నెల 31 నుంచి ఆగస్టు ఎనిమిదో తేదీల మధ్య నిర్వహించేలా ఏయూ అధికారులు తాజాగా షెడ్యూల్ విడుదల చేశారు. ఇదే విద్యార్థులకు శాపంలా పరిణమించింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) 2022లో ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం విద్యార్థులు ఒకేసారి రెగ్యులర్ కోర్సు, దూరవిద్యలో మరోకోర్సును పూర్తిచేసుకునే అవకాశం ఉంది. దీంతో ఎంతోమంది విద్యార్థులు రెండు విభిన్నమైన కోర్సులను ఒకేసారి పూర్తిచేస్తున్నారు. ఇదే ఇప్పుడు ఇబ్బందులకు కారణమయింది.

ఏయూ పరిధిలో సుమారు 1500 మంది విద్యార్థులు బీఈడీ కోర్సు చేస్తూనే, దూర విద్యలో ఎమ్మెస్సీ చదువుతున్నారు. వీరికి ... మిగతా 6వ పేజీలో

గిరిజన విద్యార్థులకు వరం ఏకలవ్యలు

పాడేరు ఐటీడీఏ పరిధిలో 11 పాఠశాలలు

ప్రతీ మండలానికి ఒకటి ఏర్పాటు

అన్ని పాఠశాలలకు రెగ్యులర్ సిబ్బంది నియామకం

- ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యా బోధన
- రూ.40 కోట్లతో భవన నిర్మాణాలు
- రెండు మూడు చోట్ల మినహా భవనాలు పూర్తి
- బాలబాలికలకు వేర్వేరుగా హాస్టళ్లు



ప్రారంభానికి సిద్ధమైన అరకులోయ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవనం

అరకులోయ, జూన్ 23: కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకలవ్య పాఠశాలలు గిరిజన విద్యార్థులకు వరంగా మారాయి. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు పూర్తి స్థాయిలో మంజూరయ్యాయి. దీంతో భవన నిర్మాణాలు రెండు,మూడు చోట్ల తప్ప అన్ని చోట్ల పూర్తయ్యాయి. బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు కూడా జరిగాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో 11 మండలాల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. తొలుత మూడు ఏకలవ్య పాఠశాలలు మంజూరు చేయగా.. తర్వాత 8 పాఠశాలలు మంజూరు చేసింది. ఏకలవ్య పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతులు నిర్వహిస్తారు. ఒక్కో పాఠశాలలో 58 మంది బోధన, బోధనేతర సిబ్బంది ఉండాలి. ఒక్కో తరగతికి 60 మంది విద్యార్థులు ఉంటారు. ఇందులో 30 మంది బాలురు, మరో 30 మంది బాలికలు ఉంటారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ గ్రూపులు ఉంటాయి. ఒక్కో గ్రూప్‌కు 30 మంది బాలబాలికలు చెరిసగం ఉంటారు. వీరందరికి ఒకే చోట పాఠశాల



చింతపల్లి ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో సిద్ధం చేసిన భవనాలు

ఉంటుంది. బాల,బాలికలకు వేర్వేరు వసతిగృహాలు, డైనింగ్, కిచెన్‌తో పాటు వార్డెన్‌లు వేర్వేరుగా ఉంటారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదివే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అన్ని వసతులతో పాటు నాణ్యమైన విద్య బోధన ఉంటుంది.

విశాఖ మన్యంలో తొలిసారిగా 2014-15 విద్యా సంవత్సరంలో ప్రయోగాత్మకంగా జీకేవీధిలో ఏకలవ్య పాఠశాలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అనంతరం 2017-18లో డుంబ్రిగుడ, ముంచంగిపుట్ మండలాల్లో మరో రెండు ఏకలవ్య పాఠశాలలు మంజూరు చేసింది. పాఠశాలలు మంజూరుతోపాటు భవన నిర్మాణాలను రెండు ఫేజ్‌ల్లో రూ.20 కోట్లు చొప్పున నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. భవన నిర్మాణాలతోపాటు గత ఏడాది ప్రత్యేక బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది కోసం 39 వేల పోస్టులు మంజూరు చేసింది. మూడు దశల్లో వీరందరిని నియమిస్తామని పేర్కొంది. ఇందులో భాగంగానే 2024-25 విద్యాసంవత్సరంలో దేశవ్యాప్తంగా పది వేల పోస్టులు భర్తీ చేసింది. ఈ విద్యా సంవత్సరంలో ప్రతీ పాఠశాలకు 12 నుంచి 18 మంది రెగ్యులర్ బోధనా, బోధనేతర సిబ్బందిని నియమించడం, వారంతా కేటాయించి చోట వారం రోజుల నుంచి విధుల్లో చేరుతున్నారు. అరకులోయ మండలంలో ప్రస్తుతం రూ.20 కోట్లతో బొండాం మజ్జివలస గ్రామ సమీపంలో 15 ఎకరాల విస్తీర్ణంలో భవన నిర్మాణాలు, కాంపౌండ్ వాల్‌తో సహ పూర్తి చేశారు. ఇక్కడ భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ పాఠశాలకు ఈ విద్యాసంవత్సరంలో 13 మంది ... మిగతా 6వ పేజీలో

ప్రజా భాగస్వామ్యంతో సమగ్రాభివృద్ధి

పాడేరు, రంప, చింతూరు ఐటీడీఏల ద్వారా గిరిజనాభివృద్ధికి పక్కా ప్రణాళికలు

- చైనా త్రీ గాడ్జెస్ ప్రాజెక్టు పరిశీలన అనుభవంతో పోలవరం పునరావాస చర్యలు

'ఆంధ్రజ్యోతి'తో అల్లూరి జిల్లా కొత్త కలెక్టర్ దినేష్‌కుమార్



రంపచోడవరం, జూన్ 23: జిల్లాలో ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో సమగ్రాభివృద్ధి సాధించడమే లక్ష్యమని అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్‌గా నియమితులైన దినేష్‌కుమార్ ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ మేరకు పనిచేస్తామన్నారు.

పూర్తి పారదర్శకతతో అవినీతి రహితంగా జిల్లాలో పాలన సాగించే దిశగా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి పోలవరం అత్యంత ప్రాధాన్యత అంశమని, అందులో నిర్వాసితుల పునరావాసం కీలకమన్నారు. ఈ అంశాలపై నివేదిక రప్పించుకుని, పునరావాస పురోగతికి టార్గెట్లు పెట్టి నిర్దిష్ట కాలాన్ని నిర్దేశిస్తామన్నారు. తనకు రంపచోడవరం ఐటీడీఏ పీవోగా పనిచేసిన అనుభవం ఉందని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితుల పునరావాసం అంశాలపై పూర్తి అవగాహన ఉందన్నారు. ఇందుకోసం చైనాలోని త్రీగాడ్జెస్ ప్రాజెక్టు పర్యటనకు వెళ్లి విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. చైనా పర్యటన అనంతరం పునరావాసంపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక కూడా ఇచ్చానన్నారు. అల్లూరి జిల్లా అంటేనే ప్రకృతి ఒడిలో సహజ వనరులతో నిండిన ప్రాంతమన్నారు. ఈ ప్రాంతంలో గిరిజనులకు సేవ చేయడం ఎంతో పవిత్రంగా భావిస్తానన్నారు. గతానుభవంతో గిరిజనుల సమగ్రాభివృద్ధికి నిర్దిష్ట ప్రణాళికలను అమలు చేస్తామని దినేష్‌కుమార్ పేర్కొన్నారు. గిరిజనుల ఆరోగ్యం, విద్య తదితర మానవ వనరులను మెరుగుపర్చేందుకు కృషి చేస్తానన్నారు. ఐటీడీఏల పాలకవర్గ సమావేశాలను సక్రమంగా నిర్వహిస్తూ ఆయా ప్రణాళికలను అమలు చేస్తామన్నారు.



హెల్కోనియా పుష్పాలు

చిలుకలు కావు.. హెల్కోనియా పూలు

కనువిందు చేస్తున్న పుష్పాలు

- అలంకరణ, బొకేల్లో వినియోగం
- విశాఖ ఏజెన్సీ వాతావరణం అనుకూలం

చింతపల్లి, జూన్ 23: ఎరుపు, ఆకుపచ్చ వర్ణంలో ఒకదాని వెనుక ఒకటి నించోబెట్టి చిలుకలు వలే కనిపిస్తున్న ఈ పుష్పలు చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానంలో కనువిందు చేస్తున్నాయి. ఈ పుష్పలను హెల్కోనియా అని పిలుస్తారు. ఇవి అరటి జాతికి చెందిన మొక్కలు. ప్రతి ఏటా జూన్ నుంచి సెప్టెంబరు వరకు హెల్కోనియ పుష్పలు పూస్తాయి. ఒక్కొక్క పుష్పం కోసిన నెల రోజుల వరకు తాజాగా ఉంటుంది. విందు, వినోద కార్యక్రమాల్లో అలంకరణ, బొకేల్లో ఈ పుష్పలను ఉపయోగిస్తారని, గిరిజన ప్రాంత వాతావరణం హెల్కోనియాకు అత్యంత అనుకూలమని స్థానిక ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్ తెలిపారు. ప్రస్తుతం ఈ హెల్కోనియా వద్ద సందర్శకులు ఫొటోలు దిగేందుకు పోటీ పడుతున్నారు.

కారడవిలో నిలిచిన భద్రాచలం బస్సు



సప్పర్ల ఘాట్‌లో సాంకేతిక లోపాలతో నిలిచిపోయిన నైట్ సర్వీస్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్న డ్రైవర్లు


- సప్పర్ల ఘాట్‌లో సాంకేతిక లోపాలు
- గంట పాటు ఆగిపోయిన బస్సు
- అర్ధరాత్రి ప్రయాణికుల అవస్థలు

సీలేరు, జూన్ 23: జీకేవీధి మండలం లంకపాకల సప్పర్ల ఘాట్ రోడ్డులో విశాఖ నుంచి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్ సర్వీస్ బస్సు సాంకేతిక లోపాలు తలెత్తి శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో దట్టమైన అటవీ ప్రాంతంలో నిలిచిపోయింది. వెంటనే సిబ్బంది బస్సులో తలెత్తిన సాంకేతిక లోపాలను పరిశీలించారు. బస్సుకు పవర్ సప్లయ్‌లో లోపాలు తలెత్తినట్టు గుర్తించి వాటిని సరిచేశారు. ఈ కారణంగా అర్ధరాత్రి కారడవిలో గంట పాటు బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఆ సమయంలో బస్సులో 25 మంది ప్రయాణికులు ఉన్నారు. గమ్యస్థానాలకు చేరుకుంటామో? లేదో? అని ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందారు. అయితే పీడీటీ డ్రైవర్లకు బస్సుకు తలెత్తిన సాంకేతిక సమస్యపై అవగాహన ... మిగతా 6వ పేజీలో

నిర్వహణ పేరిట ఇష్టారాజ్యం

గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారుల తీరు

- నీటి పథకాల మరమ్మతులకు అడ్డగోలుగా ప్రతిపాదనలు
- కాంట్రాక్టర్లతో కుమ్మక్కై దోచుకుంటున్నారనే ఆరోపణలు
- 2024-25లో రూ.36 కోట్ల ఖర్చుకు ప్రతిపాదన
- జడ్పీ అధికారుల ఆదేశాలతో రూ.32 కోట్లకు తగ్గింపు
- ప్రభుత్వం తాజా ఆదేశాలతో మరింత తగ్గే అవకాశం



పాయకరావుపేటలో నిర్వహణ పనులకు ఎదురుచూస్తున్న రక్షిత నీటి పథకం ట్యాంకులు

విశాఖపట్నం, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని రక్షిత నీటి పథకాల నిర్వహణలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. పథకాల నిర్వహణ, మరమ్మతుల పేరిట రూ.36 కోట్ల ఖర్చుకు ప్రతిపాదించగా, అవసరం లేకున్నా.. ఒకటికి రెండుసార్లు మరమ్మతుల పేరిట బడ్జెట్‌లో చేర్చడాన్ని జడ్పీ అధికారులు గుర్తించారు. దీంతో వ్యయాన్ని రూ.32 కోట్లకు తగ్గించారు. అయితే కొత్త ప్రభుత్వం తాగునీటి పథకాల నిర్వహణ, మరమ్మతులకు నిధుల కేటాయింపుపై పలు మార్గదర్శకాలు రూపొందించడంతో ఈ వ్యయం రూ.28 కోట్లకు పరిమితం కావచ్చునని భావిస్తున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలోని 43 రక్షిత నీటి పథకాలను గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రతి పథకం నిర్వహణకు అంటే (విద్యుత్ బిల్లులు, మరమ్మతులు, పైపులు, ఇతర పరికరాల కొనుగోలు, నీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయడానికి) ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు, వాచ్‌మెన్‌లు, ఫీల్డులో మరమ్మతులు చేసే టెక్నీషియన్లను నియమిస్తారు. మొత్తం 43 పథకాల నిర్వహణ కోసం టెండర్లను ఆహ్వానించి, కాంట్రాక్టర్లను ఖరారు చేస్తారు. మొత్తం వ్యయంలో మూడొంతులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేస్తే మిగిలిన సొమ్ము జడ్పీ కేటాయిస్తుంది. కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధుల నుంచి జడ్పీకి వచ్చే వాటాలో కొంతమొత్తం ఇందుకోసం కేటాయిస్తారు.

నిధులు విదల్చని వైసీపీ ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి పథకాల నిర్వహణ నిధులను ఎప్పుడూ సక్రమంగా విడుదల చేయలేదు. దీంతో అందుబాటులో ... మిగతా 6వ పేజీలో

వికటించిన నాటు వైద్యం

- మహిళకు చికిత్స చేసిన భూత వైద్యుడు, సహాయకుడు మృతి
- ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన
- అంత్యక్రియల్లో పాల్గొన్న పలువురికి అస్వస్థత
- భయందోళనలో చుట్టుమెట్ట గ్రామస్థులు
- వైద్య పరీక్షలు చేసిన ఆరోగ్య సిబ్బంది



చుట్టుమెట్ట గ్రామస్థులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



భూత వైద్యుడు సహదేవ్ (ఫైల్)



మృతి చెందిన త్రినాథ్ (ఫైల్)

పెదబయలు, జూన్ 23: మండలంలోని అరడకోట పంచాయతీ చుట్టుమెట్ట గ్రామంలో ఇద్దరు మరణించడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఓ గిరిజన మహిళకు వైద్యం చేస్తున్న క్రమంలో భూత వైద్యుడు, అతని సహాయకుడు మృతి చెందడం సంచలనంగా మారింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని చుట్టుమెట్ట కాలనీకి చెందిన పాంగి అనాసమ్మ ... మిగతా 6వ పేజీలో

విభిన్నం.. మన్యం వాతావరణం

ఉదయం వర్షం.. తర్వాత తీవ్రమైన ఎండ

స్థిరంగా కొనసాగుతున్న ఉష్ణోగ్రతలు



పాడేరులో ఆదివారం ఉదయం వర్షం కురుస్తున్న దృశ్యం

పాడేరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): మన్యంలో కొద్ది రోజులుగా భిన్నమైన వాతావరణం కొనసాగుతోంది. ప్రతి రోజూ ఉదయం లేదా సాయంత్రం వేళల్లో వర్షం కురుస్తున్నది. మధ్యాహ్నం సమయంలో తీవ్రంగా ఎండ కాస్తున్నది. ఆదివారం సైతం అదే వాతావరణం ఏర్పడింది. తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు ఒక మోస్తరు వర్షం కురిసింది. ఆ తర్వాత నుంచి వాతావరణం మారిపోయి ఎండ ప్రతాపం చూపింది. దీంతో వేడి వాతావరణం, ఉక్కపోత మామూలుగానే ఉంది. దీంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం తగ్గుముఖం పట్టని పరిస్థితి నెలకొంది.

కొయ్యూరులో 35 డిగ్రీలు..

ఏజెన్సీలో కొయ్యూరులో అత్యధికంగా 35 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, జిమాడుగులలో 28.8.7, అనంతగిరిలో 31.6, అరకులోయలో 29.3, చింతపల్లిలో 29.3, డుంబ్రిగుడలో 29.5, ముంచంగిపుట్టులో 27.1, పాడేరులో 30.8, పెదబయలులో 30.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ఆదివారం మధ్యాహ్నం ఎండ వేడికి నిర్మానుష్యంగా మారిన పాడేరు- అరకులోయ జాతీయ రహదారి

క్రైం... crime news

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి


మృతి చెందిన కర్రి దుర్గయ్య

రోలుగుంట, జూన్ 23: ఆవలోకి ఆదివారం ఉదయం చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు మునిగిపోయి మృతి చెందాడు. ఎస్సై సురేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. కొమరవోలు గ్రామానికి చెందిన కర్రి దుర్గయ్య (69) సోమవారం ఉదయం చేపలు పట్టడానికి ఆవలోకి వెళ్లాడు. ఆవ మధ్యలోకి వెళ్లగా ప్రమాదవశాత్తూ దోనె తిరగబడడంతో జారి పడిపోయాడు. దీంతో దుర్గయ్య కాళ్లకు ఆవ అడుగున ఉన్న తీగలు చుట్టుకోవడంతో నీటిలో మునిగి చనిపోయాడు. దీంతో ఎస్సై ఆధ్వర్యంలో స్థానిక మత్స్యకార సిబ్బంది దుర్గయ్య మృతదేహాన్ని నీటిలో నుంచి బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య వరహాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ఘాట్‌లో వ్యాన్ బోల్తా : డ్రైవర్‌కు గాయాలు


పాడేరు ఘాట్‌లో బోల్తాపడ్డ వ్యాన్

పాడేరు రూరల్, జూన్ 23: పాడేరు ఘట్‌లోని ఏసు ప్రభు మలుపు సమీపంలో ఆదివారం వ్యాన్‌బోల్తా పడడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. దేవాపురం పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో పండించే పైనాపిల్ పండ్లను మైదాన ప్రాంతానికి తరలించేందుకు వచ్చిన వ్యాన్, పండ్లను లోడు చేసుకొని మైదాన ప్రాంతానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడ్డ డ్రైవర్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

తాజంగిలో లారీ బోల్తా


జలాశయం వద్ద బోల్తా పడిన లారీ

చింతపల్లి, జూన్ 23: మండలంలోని తాజంగి జలాశయం సమీపంలో లారీ బోల్తా పడింది. జి.మాడుగుల నుంచి వరి కోత మిషన్‌ను ఆదివారం లారీలో నర్సీపట్నం తరలిస్తున్నారు. తాజంగి జలాశయం వద్ద జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతుండడం, ఉదయం వర్షం అధికంగా పడడంతో లారీ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి.

బైక్ బోల్తాపడి మహిళకు తీవ్ర గాయాలు

పెదబయలు: అరడకోట పంచాయతీలోని చుట్టుమెట్ట గ్రామ సమీపంలో ఆదివారం బైక్ బోల్తాపడి మహిళ తీవ్రంగా గాయపడ్డారు. లక్ష్మీపేట పంచాయతీ కప్పాడ గ్రామానికి పాంగి కంఠం, అతని తల్లి పాంగి కోనే ద్విచక్ర వాహనంపై పాడేరు వైపు నుంచి స్వగ్రామం వస్తుండగా చుట్టుమెట్ట సమీపంలో కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి బోల్తా పడ్డారు. బైక్‌పై నుంచి కింద పడడంతో కోనే తల, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. అలాగే కంఠం స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు అరడకోట ఏఎన్ఎం రత్నకుమారికి సమాచారం ఇవ్వడంతో, ఆమె సంఘటనా స్థలానికి వచ్చి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం ఆటోలో పెదబయలు పీహెచ్‌సీకి తరలించారు.

నర్సీపట్నంలో పట్టపగలు చోరీ

» ఐదు తులాల బంగారం అపహరణ

నర్సీపట్నం, జూన్ 23: మున్సిపాలిటీ పరిధిలోని అయ్యన్నకాలనీలో పట్టపగలు ఒక ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన సూరిశెట్టి వెంకటరమణ, అతని భార్య అంబేద్ సెంటర్‌లో పండ్ల వ్యాపారం చేస్తుంటారు. భార్య భర్తలిద్దరూ ఉదయం దుకాణం వద్దకు పోయి రాత్రి ఇంటికి వస్తుంటారు. శనివారం ఉదయం షాపు వద్దకు వెళ్లి రాత్రి 8 గంటలకు ఇంటికి వచ్చే సరికి తలుపు తెరిచి ఉన్నాయి. పడక గదిలో బీరువా పగలగొట్టి ఉంది. దుస్తులు చెల్లాచెదురుగా పడేసి ఉన్నాయి. బీరువాలో ఐదు తులాలు బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఉమామహేశ్వరావు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేసి ఇంట్లో కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తీసుకున్నారు. క్లూజ్ టీమ్ సభ్యులు వేలి ముద్రలు సేకరించారు.

172 కిలోల గంజాయి స్వాధీనం

పద్మనాభం, జూన్ 23: గంజాయి రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసినట్టు పద్మనాభం పోలీసులు చెప్పారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. ఈనెల 22న రాత్రి పద్మనాభం పోలీసులు, టాస్క్‌ఫోర్సు పోలీసులు గస్తీ తిరుగుతుండగా గంజాయి రవాణా జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకు చిన్నాపురం జంక్షన్ వద్ద ఒక కారును ఆపడానికి ప్రయత్నించారు. కారు ఆపకపోవడంతో పోలీసులు వారిని వెంబడించారు. పప్పుల మిల్లు వద్ద కారును అడ్డుకుని తనిఖీ చేయగా 172 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. ఈమేరకు తుని ప్రాంతానికి చెందిన బొండలపు అప్పారావు, బోదల సురేష్, చింతమనేని రాజా, మజ్జి రమేష్ (అరకు)ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్‌లు, కారును స్వాధీనం చేసుకొని పద్మనాభం స్టేషన్‌కు అప్పగించారు. సీఐ శ్రీధర్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు.

కోడిపందాలు ఆడుతున్న ఏడుగురి అరెస్టు

ఆనందపురం, జూన్ 23 : మండలంలోని దుక్కవానిపాలెం గ్రామంలో కోడి పందాల శిబిరాలపై పోలీసులు ఆదివారం దాడి చేసి, ఏడుగురిని అరెస్టు చేశారు. సీఐ తిరుపతిరావు తెలిపిన వివరాలు ప్రకారం.. దుక్కవానిపాలెంలో కోడిపందాలు ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈమేరకు ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఏడు బైక్‌లు, పది వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే వేములవలస శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు సంతోష్, శివ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

కొత్తూరు, జూన్ 23 : అనకాపల్లి మండలం మొండిపాలెంలో ఆదివారం పేకాట శిబిరంపై దాడి చేసినట్టు రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి నలుగురు జూదరులను అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి రూ.నాలుగు వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

15 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

అనకాపల్లి టౌన్, జూన్ 23: మద్యాన్ని అక్రమంగా తరలిస్తూ ఓ వ్యక్తి ఆదివారం పట్టుబడినట్టు పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. కశింకోట మండలం తాళ్లపాలెం గ్రామానికి చెందిన బండా శ్రీను అనకాపల్లిలో మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి వెళ్తుండగా, రింగురోడ్డు జంక్షన్‌లో అతనిపై అనుమానం వచ్చి తనిఖీ చేశామన్నారు. పదిహేను మద్యం క్వార్టర్ సీసాలు అతని వద్ద లభ్యం కావడంతో కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్టు చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529


ప్రారంభానికి నోచుకోని పశువైద్య శాల భవనం


ప్రస్తుతం సామాజిక భవనంలో కొనసాగుతున్న పశువైద్యశాల

పక్కా భవనం ఉన్నా.. శిథిల గదుల్లో విధులు

రాంబిల్లిలో నిరుపయోగంగా పశువైద్య శాల

» పదిహేనేళ్ల క్రితం నిర్మాణం
» మౌలిక వసతుల కల్పనకు నిధులు చాలక చేతులెత్తేసిన కాంట్రాక్టర్
» ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన సామాజిక భవనంలో నిర్వహణతో ఇబ్బందులు

రాంబిల్లి, జూలై 23: లక్షలాది రూపాయలు వెచ్చించి రాంబిల్లిలో నిర్మించి పశు వైద్య కేంద్రం భవనం నిరుపయోగంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా ఈ భవనం గురించి పట్టించుకునేవారు కరువయ్యారు. ఫలితంగా ప్రజా ధనం వృథా అవుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదిహేనేళ్ల క్రితం రూ.10.68 లక్షలు వెచ్చించి ఈ భవనాన్ని నిర్మించారు. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఈ భవనం మందుబాబులకు అడ్డాగా మారింది. చీకటిపడితే ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయని పరిసరాల వారు వాపోతున్నారు. విద్యుత్, మరుగుదొడ్లు, ప్రహరీ వంటి పనులకు నిధులు చాలకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పనులను నిలిపివేసినట్టు తెలిసింది. ఇదిలావుంటే, ప్రస్తుతం పశు వైద్యశాల ఇక్కడ పరాయి పంచన కొనసాగుతోంది. శిథిలమైన సామాజిక భవనంలో ఈ ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఇటు సిబ్బందితో పాటు అటు పశువులను వైద్యానికి తీసుకువచ్చేవారు ఇబ్బందులు ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా భవనం కారిపోయి నీరు చేరి మందులు తడిసిపోతున్నాయని చెపుతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనంలో మౌలిక సదుపాయలు కల్పించి, ప్రస్తుతం శిథిల భవనంలో కొనసాగుతున్న పశు వైద్యశాలను అందులోకి మార్చాల్సిందిగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అత్యుత్తమ నియోజకవర్గంగా ఎలమంచిలి

» మహా నగరంగా అచ్యుతాపురాన్ని నిర్మించుకుందాం
» ఎవరికి ఏ అవసరం ఉన్నా నేరుగా సంప్రదించండి
» విజయోత్సవ సభలో ఎమ్మెల్యే 'సుందరపు'


విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

అచ్యుతాపురం, జూన్ 23: ఎలమంచిలిని అత్యుత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. అచ్యుతాపురం మండల కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం జరిగిన భారీ విజయోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. ఎలమంచిలిలో కొత్త రాజకీయానికి ప్రజలంతా తెరలేపారని, అందువల్లే ముందెన్నడూ లేని విధంగా తనను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. టీడీపీ ఒక రాజకీయ విశ్వవిద్యాలయం అని, ముందుగా అందులో ఉండడం వల్ల తాను రాజకీయంలో డిగ్రీ పట్టా పుచ్చుకున్నానని తెలిపారు. ఆ తర్వాత పవన్ కళ్యాణ్ వద్ద పనిచేసి జ్ఞానంతో పాటు సంస్కారం నేర్చుకున్నట్టు వివరించారు. నియోజకవర్గం ప్రజలు పదిహేనేళ్ల కన్నబాబురాజు పాలన, ఐదేళ్ల జగన్ పాలనలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వాపోయారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని స్పష్టం చేశారు. అందరూ సహకరిస్తే పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురాన్ని మహా నగరంగా నిర్మించుకుందామన్నారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా తనను నేరుగా సంప్రదించాలన్నారు. కూటమి నాయకుల సహాయ సహకారాలతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందామని పునరుద్ఘాటించారు. అంతకు ముందు ఎలమంచిలి నుంచి భారీ బైక్ ర్యాలీతో వచ్చిన విజయకుమార్‌కు అచ్యుతాపురం జంక్షన్‌లో క్రేన్ సహాయంతో కూటమి శ్రేణులు, అభిమానులు భారీ గజ పూలమాలతో సత్కరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సన్యాసి నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, నాయకులు జనపరెడ్డి నర్సింగరావు, లాలం చందు, జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి శ్రీరామదాసు, దినబాబు, కె.పవన్ విజయ్, డీఎస్ఎన్ రాజు, ద్వారపురెడ్డి బాపూజీ, హరిరాజు, గిరి రాజు, లాలం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా ఘన స్వాగతం

ఎలమంచిలి : ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించి, అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా నియోజకవర్గానికి విచ్చేసిన విజయకుమార్‌కు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. ఏటికొప్పాకలో ప్రారంభమైన విజయోత్సవ ర్యాలీ ఎలమంచిలి మీదుగా అచ్యుతాపురం వరకూ ఐదు గంటల పాటు సాగింది. తొలుత ఆయన ఏటికొప్పాకలో గ్రామ దేవత బండిమాంబను దర్శించుకుని, పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రతినిధి సుందరపు సతీష్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరావులతో ఎమ్మెల్యే ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కాండ్రకోట చిరంజీవి, అన్నం బాబ్జీలు ఆయనను ఘనంగా సత్కరించారు. ఎలమంచిలి చేరుకున్న ఎమ్మెల్యేకు నాయకులు కొఠారు సాంబ, బొద్దపు శ్రీను, కొఠారు నరేష్, కొఠారు శ్రీను, గొర్లె నానాజీ, ఆదిమూర్తి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, కూటమి నాయకులు గొన్నాబత్తుల నాగేశ్వరరావు, రాజాన వెంకునాయుడు, రాజాన నారాయణమ్మ, లవుడు లోవరాజు, బొద్దపు శ్రీను, లవుడు లోవరాజు, గుర్రాల శేఖర్, కొఠారు శ్రీను, వూటకూటి రమేష్ నాయుడు, సోము నాయుడు, బుల్లిబాబు, చిట్టిబాబు లతో పాటు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేతో కలిసి సభలో సంఘీభావం తెలుపుతున్న కూటమి నాయకులు

'విశాఖలో ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు'


మాట్లాతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

డాబాగార్డెన్స్, జూన్ 23: విశాఖలో సెప్టెంబరు మొదటి వారంలో ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు నిర్వహించనున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు తెలిపారు. ఆదివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏఐటీయూసీ ఉత్తరాంధ్ర జిల్లాల కార్యవర్గ సభ్యుల విస్తృతస్థాయి సమావేశాన్ని విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి జాతీయ సమితి సభ్యులు ఈ సమావేశాలకు హాజరవుతారన్నారు. నగరంలో వేలాది మందితో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాట కార్యక్రమాలపై రూపకల్పన చేస్తామని తెలిపారు. దేశ సమగ్రతకు పట్టుకొమ్ములుగా ఉన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను కారుచౌకగా ప్రైవేట్‌వ్యక్తులకు విక్రయించాలని చూడడం క్షమించరాని నేరమన్నారు. గత ఐదేళ్ల కాలంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రైవేటీకరణ అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. సర్వీస్ బెనిఫిట్స్ కార్మికులకు ఇవ్వడం లేదన్నారు. యజమానుల శ్రమ దోపిడీకి కార్మికుల గురయినా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. రానున్న రోజుల్లో ఏఐటీయూసీ వీటిపై పోరాటానికి సన్నద్ధమవుతోందన్నారు. జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ, స్టీల్‌యూనియన్ అధ్యక్షుడు కె.సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, స్రవంతి, జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మధరావు, బి.వెంకటరావు, ఆర్.దొరబాబు, ఆశోక్, షణ్ముఖరావు, రెహమాన్, నాయుడు, గోవిందు, పోతన్న పాల్గొన్నారు.

అలలపై.. కేరింత


విశాఖ నగరంలోని తీరప్రాంతాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. ఉదయం వాతావరణం చల్లగా ఉండడంతో పర్యాటకులు బీచ్‌లకు చేరుకుని సందడి చేశారు. ఒకవైపు వర్షపు జల్లులు పడుతున్నా.. లెక్క చేయకుండా యువత అలలపై సర్ఫింగ్ చేస్తూ సందడి చేశారు. - విశాఖపట్నం

ఆంధ్ర సీనియర్ క్రికెట్ జట్టు కోచ్‌గా టిను యోహానన్



విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 23: ఆంధ్ర సీనియర్ పురుషుల జట్టుకు భారత మాజీ క్రికెటర్ టిను యోహానన్ ప్రధాన కోచ్‌గా నియమితులయ్యారు. 2024-25 సీజన్‌కుగాను పురుషుల జట్టుకు ప్రధాన కోచ్‌గా ఆయన వ్యవహరించనున్నారు. కేరళకు చెందిన యోహానన్ 2001- 2002లో ఇంగ్లాండ్, న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లలో మూడు మ్యాచ్‌లు... 2002లో వెస్టిండీస్, శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లలో మూడు మ్యాచ్‌ల్లో భారత్ సీనియర్ క్రికెట్ జట్టుకు ఆడా రు. ఇక, అండర్-23 పురుషుల జట్టుకు జె.కృష్ణారావు, సీనియర్ మహిళల జట్టుకు ఎంఎస్.విక్రమ్ వర్మ, అండర్-23 మహిళల జట్టుకు ఎస్. రమాదేవిలను ప్రధాన కోచ్‌లుగా నియమితులయ్యారు. మహిళల అండర్-19 విభాగానికి ఎస్. శ్రీనివాసరెడ్డి, అండర్-15 విభాగానికి ఎం.సవిత ప్రధాన కోచ్‌లుగా వ్యవహరించనున్నారు. సీనియర్ పురుషుల జట్టుకు ప్రధాన కోచ్‌గా నియమితులైన యోహానన్‌తోపాటు వివిధ విభాగాలకు ప్రధాన కోచ్‌లుగా నియమితులైన వారి శిక్షణలో ఆంధ్ర జట్లు మంచి ఫలితాలు సాధిస్తాయని ఏసీఏ అధ్యక్ష కార్యదర్శులు శరత్ చంద్రారెడ్డి, ఎస్ఆర్. గోపీనాథరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

భక్తులతో నూకాంబిక ఆలయం కిటకిట


అమ్మవారి దర్శనానికి క్యూ లైన్ల వేచి ఉన్న భక్తులు

అనకాపల్లి టౌన్, జూన్ 23: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము ఆరు గంటలకు బాలాలయంలోని అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. విశాఖ ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ఆరంభమైంది. దీంతో ఆలయానికి వచ్చే మార్గాలు సందడిగా మారాయి. పసుపు, కుంకుమ అమ్మవారికి సమర్పించి అంతా మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో పలువురు భక్తులు వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సీఐ పి.పైడపునాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

'మహోన్నతుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ'


ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అనకాపల్లి, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): జనసంఘ్ వ్యవస్థాపకులు, జాతీయ భావ సిద్ధాంత రూపకర్త డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం ఇక్కడి ఎంపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాల వేసి, నివాళులర్పించారు. ఎంపీ సీఎం రమేశ్ ఆదేశాల మేరకు దివంగత నేత ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహోన్నత వ్యక్తి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని కీర్తించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నిఖిల్, విజయ్‌నాయుడు, కొండబాబు, నాగేశ్వరరావు, పరదేశినాయుడు, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ సేవలకు రెడ్ క్రాస్ సొసైటీ సత్కారం


దొరస్వామికి ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న సొసైటీ ప్రతినిధులు

అచ్యుతాపురం, జూన్ 23: రక్తదానంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తూ.. రక్తదాన శిబిరాలను విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు బ్రాండిక్స్ భారత భాగస్వామి పి.దొరస్వామిని విశాఖకు చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అభినందించింది. ఈ మేరకు ఆదివారం రక్తదాన శిబిరం వద్ద ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వై.శివనాగేంద్ర రెడ్డి మాట్లాడుతూ దొరస్వామి ఆధ్వర్యంలో బ్రాండిక్స్ ద్వారా నెలకు రెండుసార్లు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ శిబిరాల ద్వారా అనేక మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తాన్ని దానం చేస్తుండడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. అలాగే, ఆరు సంవత్సరాలుగా 128 ఉచిత కంటి వైద్య శిబిరాలు కూడా నిర్వహించి ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నారన్నారు. అంతేకాకుండా అవసరమైన వారికి విశాఖ శంకర్ ఫౌండేషన్ ద్వారా ఆపరేషన్లు చేయిస్తుండడం మరో విశేషంగా పేర్కొన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునన్నారు. తద్వారా మూడు ప్రాణాలు కాపాడడమే కాకుండా దాతకు కూడా ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉంటాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'వర్సిటీల్లో వంగలి యువతకు ఉపాధి కల్పించాలి'


ఎంపీ సీఎం రమేశ్‌కు వినతిని అందిస్తున్న టీడీపీ నాయకుడు గణేశ్

సబ్బవరం, జూన్ 23: మండలంలోని వంగలి రెవెన్యూ పరిధిలో గల ఇండియన్ మారిటైం వర్సిటీ, నిర్మాణంలో ఉన్న పెట్రో వర్సిటీలో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని టీడీపీ నాయకుడు ఆకుల గణేశ్ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్‌కు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో జెట్టి హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన


స్వర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

సింహాచలం, జూన్ 23: వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణపుష్పార్చన, నిత్య కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. అనంతరం ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ సంపెంగలు తీసి నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున స్వర్ణ సంపెంగలతో పూజ చేశారు. అనంతరం అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో నిత్య కల్యాణం జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

రాష్ట్రస్థాయి ఆర్చరీ టోర్నీకి అరకు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 23: రాష్ట్రస్థాయి అండర్-13, 15 బాల బాలికల ఆర్చరీ చాంపియన్‌షిప్ టోర్నీకి అరకు వ్యాలీలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్పోర్ట్సు స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. విజయవాడలో జరిగే ఈ టోర్నీలో అండర్-13 కేటగిరిలో ఎస్. రామచిత్యాన్, అండర్-15 విభాగంలో కె.కె. హర్ష, వి. లలిత్ సాయి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొంటున్న విద్యార్థులతోపాటు కోచ్ సూరిబాబును స్కూల్ ప్రిన్సిపాల్ పీఎస్ఎన్. మూర్తి అభినందించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లా పనిచేశారు

ఆదివాసీలను తప్పుదోవ పట్టించిన వ్యక్తులపై ప్రభుత్వానికి ఫిర్యాదు

టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి, పక్కన నాయకులు

చింతపల్లి, జూన్ 23: పాడేరు నియోజకవర్గంలో గ్రామ వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లా పనిచేశారని, వైసీపీకి ఓటు వేయకపోతే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని బెదిరించారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. ఆదివాసీలను తప్పుదోవ పట్టించిన గ్రామ వలంటీర్లపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తున్నట్టు చెప్పారు. మండలంలోని కొత్తపాలెం గ్రామ పంచాయతీలో ఆదివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గంలో టీడీపీ ఓటమికి గ్రామ వలంటీర్ల అసత్య ప్రచారమే ప్రధాన కారణమన్నారు. ప్రభుత్వ గౌరవ వేతనం తీసుకుంటున్న గ్రామ వలంటీర్లు నిష్పక్షపాతంగా ప్రజలకు సేవలు అందించాల్సిందిపోయి, వైసీపీ కార్యకర్తలు మాదిరిగా పనిచేశారన్నారు. వైసీపీకి ఓటు వేయకుంటే పింఛన్, చేయూత, రైతు భరోసా ఆగిపోతాయని, కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అమలుకావని ప్రచారం చేశారన్నారు. శివారు గ్రామాల అమాయకులైన ఆదివాసీలు గ్రామ వలంటీర్ల అసత్య ప్రచారాన్ని నమ్మి వైసీపీకి ఓటు వేశారన్నారు. ప్రస్తుతం రాజీనామా చేసిన వలంటీర్లు వైసీపీ నాయకుల ఒత్తిడి వల్ల ఉద్యోగాలు వదులుకోవాల్సి వచ్చిందని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు ఇస్తున్నారన్నారు. వైసీపీ కార్యకర్తలు మాదిరిగా పనిచేసిన ఏ వలంటీర్‌కు తిరిగి అవకాశం ఇచ్చేదిలేదన్నారు. గిరిజనులు ఓట్లు వేసి చట్టసభలకు పంపిస్తే పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు అసెంబ్లీ సమావేశాలకు ఎగనామం పెట్టడం దురదృష్టకరమని గిడ్డి ఈశ్వరి అన్నారు. అసెంబ్లీకి వెళ్లకపోతే గిరిజనుల సమస్యలు చట్టసభల్లో ఎవరు ప్రస్తావిస్తారని ఆమె ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి రావడంతో చంద్రబాబు గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేస్తారని, అయితే నియోజకవర్గం ముఖ్యమైన సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించే బాధ్యత విశ్వేశ్వరరాజుకి లేదా? అని నిలదీశారు. చట్టసభలకు హాజరుకాని ఎమ్మెల్యేను ఎన్నుకోవడం ఆదివాసీలకు తీరని నష్టమన్నారు. గిరిజన ప్రాంత ప్రజల సమస్యలపై సంపూర్ణ అవగాహన కలిగిన అయ్యన్నపాత్రుడును సీఎం చంద్రబాబు స్పీకర్‌గా నియమించడంపై ఆదివాసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారని గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, నాయకులు రీమల ఆనందరావు, పాంగి రాము, పురుషోత్తం, రామ్మూర్తి, వర్తక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జోగేశ్వరరావు, పెదిరెడ్ల బేతాళుడు, తాటిపాకల నాగేశ్వరరావు, రమేశ్, ఉద్యోగ సంఘాల నాయకులు గెమ్మెలి మోహన్, గసాడి పద్మనాభం, కుడుముల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ డిప్లొమా ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

» ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ సురేశ్ కుమార్

చింతపల్లి, జూన్ 23: అగ్రికల్చర్ డిప్లొమా ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అగ్రికల్చర్ డిప్లొమా ప్రవేశాలకు ఈ నెల 30 వరకు గడువు పెంచినట్టు చెప్పారు. రెండేళ్ల కాల పరిమితి కలిగిన డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్, మూడేళ్ల డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానించడం జరిగిందన్నారు. చింతపల్లి డిప్లొమా కళాశాలలో డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్ కోర్సు ఉందన్నారు. ప్రభుత్వ కళాశాలలో 688, ప్రైవేటు కళాశాలలో 2,530 సీట్లు ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఇందుకుఅర్హులన్నారు. ఇంటర్ ఫెయిల్ విద్యార్థులు అర్హులేనని, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు అనర్హులన్నారు. పదోతరగతిలో సాధించిన మార్కులు ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. ఈఅవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన రమేశ్‌నాయుడు



పాడేరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ.రమేశ్ నాయుడు ఆదివారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు, తదితర అంశాలపై చర్చించారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నారా లోకేశ్ అన్నారని రమేశ్ నాయుడు తెలిపారు.

నారా లోకేశ్‌తో కొట్టగుల్లి సుబ్బారావు



పాడేరు రూరల్: రాష్ట్ర మానవ వనరులు, ఐటీ కమ్యూనికేషన్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేశ్‌ను పాడేరు టీడీపీ నాయకుడు, రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు ఆదివారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అలాగే రాష్ట్ర హోం మంత్రిగా బాధ్యతలను చేపట్టిన వంగలపూడి అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కలిశారు.





మోదకొండమ్మకు ఘటాలతో మొక్కులు తీర్చుకోనేందుకు వెళ్తున్న భక్తులు... సక్కలపుట్టులో మోదకొండమ్మ ఉత్సవ విగ్రహం, ఘటాలను ఊరేగింపుగా తరలిస్తున్న గ్రామ పెద్దలు

మోదకొండమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

పాడేరు రూరల్, జూన్ 23: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. మన్యంలోని వివిధ గ్రామాల ప్రజలతో పాటు మైదాన ప్రాంతం నుంచి వందలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. దీంతో ఉదయం 6 గంటల నుంచే అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. ఇటీవల మూడు రోజులు పాటు జరిగిన అమ్మవారి ఉత్సవాల్లో మొక్కులు చెల్లించుకోవడానికి అవకాశం లేని భక్తులు పండగ అనంతరం వచ్చే ఆది, మంగళవారాల్లో అమ్మవారి పండగలను నిర్వహించుకుంటున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం మొక్కులు తీర్చుకొనే భక్తులతో అమ్మవారి ఆలయం మరింత సందడిగా మారింది. వందలాది మంది భక్తులు కుటుంబ సభ్యులతో అమ్మవారికి ఘటాలను సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో పండగలను నిర్వహించి వంటలు చేసుకుని బంధుమిత్రులతో ఆనందంగా గడిపారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో ఆలయ ప్రసాద కమిటీ ప్రతినిధులు ప్రసాదం పంపిణీ చేశారు. పాడేరు ఘాట్‌లోని అమ్మవారి పాదాల వద్దకు మైదాన ప్రాంత భక్తులు వందలాది మంది వచ్చి మొక్కులు తీర్చుకోవడంతో ఆలయం రద్దీగా కనిపించింది.

నక్కలపుట్టులో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం

కిండంగి పంచాయతీ పరిధిలోని నక్కలపుట్టు గ్రామంలో మూడు రోజులు పాటు నిర్వహించే మోదకొండమ్మ ఉత్సవాలను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మోదకొండమ్మ ఆలయం నుంచి ఆదివారం ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పాటు ఘటాలను శతకంపట్టు వరకు భారీ ఊరేగింపుగా తరలించి ప్రతిష్ఠించారు. మూడు రోజుల ఉత్సవాలు నేపథ్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాలు విజయవంతానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సొనారి రత్నకుమారి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు, టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు జనపరెడ్డి శ్రీనివాసరావు, కొత్తల త్రినాథ్, బుక్కా జగదీష్, యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం





సీలేరులో భారీ వర్షానికి రోడ్డుపై పారుతున్న నీరు... చింతపల్లిలో హోరున కురుస్తున్న వాన

చింతపల్లి, జూన్ 23: మన్యంలోని పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. పాడేరు, గూడెంకొత్తవీధి, చింతపల్లి, ముంచంగిపుట్టు మండలాల్లో ఆదివారం మోస్తరుగా వాన పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చింతపల్లిలో శనివారం అర్ధ రాత్రి నుంచి ఆదివారం ఉదయం 11 గంటల వరకు కుండపోత వర్షం కురిసింది. అధిక వర్షం వల్ల ప్రధాన రహదారులన్నీ వాగులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు, చెరువులు వర్షపు నీటితో నిండిపోయాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కాగా మరో నాలుగు రోజుల పాటు ఏజెన్సీ వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు.

సీలేరులో...

సీలేరు: గూడెంకొత్తవీధి మండలంలోని మేజర్ పంచాయతీ సీలేరులో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో కురవడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు ఒక మోస్తరు వర్షం కురవడంతో ఉష్ణోగ్రతలు బాగా తగ్గుముఖం పట్టాయి. దీంతో జనాలు సేదదీరారు. తెల్లవారుజాము నుంచి సీలేరులో వర్షం కురవడంతో సంతకు గిరిజనులు హాజరు కాలేదు. దీంతో సంత వెలవెలబోయింది.

ముంచంగిపుట్టులో...

ముంచంగిపుట్టు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. అలాగే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాసింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వర్షం పడింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. పలుచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. మట్టి రహదారులు బురదమయంగా మారాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు.

నిర్వహణ పేరిట ఇష్టారాజ్యం!

... 3వ పేజీ తరువాయి

ఉన్న నిధులను కేటాయించేవారు. జడ్పీకి ఆర్థిక సంఘం నుంచి వచ్చే గ్రాంట్‌ను కూడా ఇందుకోసం వినియోగించేవారు. ఇదంతా ఒక ఎత్తైతే... పథకాల నిర్వహణకు భారీగా ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపడం గ్రామీణ నీటి సరఫరా విభాగంలో గత ఐదేళ్లుగా జరుగుతోందనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో నీటి పథకాల నిర్వహణకు సుమారు రూ.36 కోట్లతో టెండర్లు పిలిచారు. దీనికి జడ్పీకి కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.9 కోట్లు కేటాయించారు. టెండర్ల మేరకు ఇప్పటివరకు రూ.5.5 కోట్లు నిధులు విడుదలచేసి కాంట్రాక్టర్లకు చెల్లించేశారు. మరో రూ.3.5 కోట్ల బిల్లులు మంజూరు చేసేందుకు రంగం సిద్ధమయింది. అయితే టెండర్లు, బడ్జెట్‌తో సంబంధంలేకుండా నీటి పథకాల నిర్వహణకు అంతరాయం కలగకూడదని ప్రభుత్వం ఆదేశించడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నీటి పథకాల నిర్వహణ, మరమ్మతులకు రూ.36 కోట్లు అవసరమని ప్రతిపాదించి జడ్పీకి పంపారు.

అంచనాలపై అనుమానాలు

ఈ ప్రతిపాదనలు జడ్పీ అధికారులు పరిశీలించగా అనేక సందేహాలు తలెత్తాయి. పథకాలు ఒకటి రెండు కంటే ఎక్కువసార్లు మరమ్మతులకు గురవుతాయని ముందుగానే అంచనావేసి ఖర్చులకు ప్రతిపాదనల్లో పొందుపరిచిన విషయాన్ని గుర్తించారు. పథకం వయసును బట్టి మరమ్మతులకు నిధులు కేటాయించాల్సి ఉండగా ఎక్కువ నిధులు అవసరమని పొందుపరిచినట్టు గుర్తించి గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు వివరించారు. దీంతో ముందుగా ప్రతిపాదించిన రూ.36 కోట్లను రూ.32 కోట్లకు కుదించారు. ఈ మేరకు త్వరలో టెండర్లు ఆహ్వానించేందుకు సిద్ధమవుతున్నారు.

ఇదిలావుండగా ప్రస్తుత ప్రభుత్వం తాగునీటి సరఫరా, ఇబ్బందులను తొలగించడంపై ప్రధానంగా దృష్టిసారించింది. తాజాగా గ్రామీణ నీటి సరఫరా విభాగం పరిధిలో పథకాల నిర్వహణకు తీసుకోవాల్సిన మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. ఈ మేరకు పథకాల నిర్వహణ, మరమ్మతుల వ్యయం ఎలా తగ్గించాలో నిర్దేశించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో నీటి పథకాల నిర్వహణకు సిద్ధంచేసిన ప్రతిపాదనలు రూ.32 కోట్ల నుంచి రూ.27 కోట్లు లేదా రూ.28 కోట్లకు తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. అంటే ఇప్పటి వరకు ఏటా నీటి పథకాల నిర్వహణ, మరమ్మతులకు ప్రతిపాదనలు ఆమోదించి, అధికారులే కాంట్రాక్టర్లతో కుమ్మక్కై దోచుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయంటున్నారు.

ఒకేసారి రెండు పరీక్షలు!

... 3వ పేజీ తరువాయి

ఒకేసారి పరీక్షలు నిర్వహించేలా షెడ్యూల్ విడుదలవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జూలై 31 నుంచి ఆగస్టు మూడో తేదీ వరకు బీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించేలా అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. అదే సమయంలో దూరవిద్యలో ఎమ్మెస్సీ బోటనీ, ఫిజిక్స్, జువాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, మ్యాథ మెటిక్స్ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు జూలై 31 నుంచి ఆగస్టు ఎనిమిదో తేదీ వరకు పరీక్షలు నిర్వహించేలా షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో ఈ రెండు కోర్సుల్లో చేరిన వందలాది మంది విద్యార్థులు తలలు పట్టుకుంటున్నారు. బీఈడీ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు పరీక్ష జరగనుండగా, ఎమ్మెస్సీ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఒకేసారి రెండు పరీక్షలకు ఎలా హాజరవుతామని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి షెడ్యూల్ మార్చాలని కోరుతున్నారు. ఈ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదంటున్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు



శ్యామ్‌ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

పాడేరు రూరల్, జూన్ 23: జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులు, జాతీయవాది డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కురసా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బావితరాల కోసం బలిదానం చేసిన మొట్టమొదటి దేశ భక్తుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అన్నారు. జమ్మూకశ్మీరు భారత్‌లో అంతర్భాగం కావడానికి ఆయన ముఖ్య కారకులన్నారు. శ్యామ్‌ప్రసాద్ కోరిక మేరకు జమ్మూ కశ్మీరులో ఆర్టికల్ 370ని ప్రధాని మోదీ రద్దు చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాంగి రాజారావు, రాఘవేంద్రరావు, పి.రవికుమార్, ఎస్.వేమనబాబు, వి.అబ్బులు, పి.రవిచంద్ర, పాపిటి రాజు, ఎల్.అబ్బాయిదొర, పి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు వరం ఏకలవ్యలు

... 3వ పేజీ తరువాయి

రెగ్యులర్ బోధనా సిబ్బందిని నియమించింది. వారంతా రెండు రోజుల క్రితం విధుల్లో చేరారు. అదేవిధంగా అనంతగిరి మండలంలో అనంతగిరికి సమీపంలోని పాతకోటలో 15 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఏడాదే రూ.20 కోట్లతో భవన నిర్మాణాలు ప్రారంభించారు. పనులు చకచకా సాగుతున్నాయి. ఈ పాఠశాలకు 11 మంది రెగ్యులర్ బోధనా సిబ్బందిని నియమించారు. డుంబ్రిగుడ, ముంచంగిపుట్ మండల కేంద్రాలలో 2017-18లో భవనాలకు నిధులు మంజూరైనా కొన్నాళ్ల పాటు ప్రారంభం కాలేదు. ఇక్కడ భవన నిర్మాణాలకు సంబంధించి కోర్టులో కేసు ఉంది. మూడేళ్ల క్రితం పనులు ప్రారంభించినా నత్తనడకన సాగుతున్నాయి. భవన నిర్మాణాలు దాదాపు పూర్తి కావచ్చినప్పటికీ మౌలిక సౌకర్యాల పనులు చేపట్టాల్సి ఉంది. ప్రహరీ నిర్మించాల్సి ఉంది. వీటిపై నూతన ప్రభుత్వం దృష్టి సారించి పాత రేట్లతో కాకుండా పెరిగిన ధరలకు అనుగుణంగా భవనాలకు నిధులు మంజూరు చేయాల్సి ఉంది. బాలికలు టీడబ్ల్యూ గురుకుల బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలోను... బాలురు యూత్ ట్రైనింగ్ సెంటర్లలోను ఈ మూడు పాఠశాలలు కొనసాగుతున్నాయి. హుకుంపేట మండలంలో స్థలం కేటాయింపులో జాప్యం జరగడంతో పనులు ప్రారంభం కాలేదు. స్థలం కేటాయించాల్సి ఉంది. పెదబయలు ఏకలవ్య పాఠశాలకు సంబంధించిన భవనం పనులు పూర్తి కావచ్చాయి. చింతపల్లిలో మొదటి దశలోనే భవనాలు ప్రారంభం కావడం, పాఠశాల కొనసాగుతుండగా రెండో విడత మంజూరైన రూ.20 కోట్లతో నిర్మించిన భవనాలు పూర్తయ్యాయి. ఇవి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. జీకే వీధి మండలంలో 2014-15లో పాఠశాల ప్రారంభం కావడం, అనంతరం భవన నిర్మాణాలు చేపట్టి విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి. జి.మాడుగుల, కొయ్యూరు మండలాల్లో భవన పనులు జరుగుతున్నాయి.

వికటించిన నాటు వైద్యం

... 3వ పేజీ తరువాయి

మరికొంతమంది మహిళలు ఈనెల 19వ తేదీన సమీపంలో ఉన్న కాఫీ కొండపైకి వెళ్లి మామిడి పండ్లు ఏరుతున్న సమయంలో భయంకరమైన ఒక వింత శబ్దం వచ్చింది. ఆ శబ్దానికి భయపడిన అనాసమ్మ పూనకం వచ్చినట్టు అరుస్తూ అస్వస్థతకు గురికావడంతో తోటి మహిళలు గ్రామానికి తీసుకువచ్చారు. బాధితురాలి తమ్ముడు కిల్లో త్రినాథ్ అదే గ్రామానికి చెందిన భూత వైద్యుడు కిముడు సహదేవ్ వద్దకు అనాసమ్మను తీసుకెళ్లాడు. ఆమెకు గాలి సోకిందని, విభూదిని వేడిచేసిన కొడవలిపై వేసి రెండు వైపుల నుంచి ఇద్దరు బలంగా ఊదారు. అలా ఊదిన క్షణంలో అనాసమ్మ తేరుకోగా.. విభూది ఊదిన సహదేవ్ (41), త్రినాథ్(36) అస్వస్థతకు గురై వాంతులు, విరేచనాలు బారిన పడి మృతి చెందారు. దీంతో గ్రామస్థులు భయాందోళన చెందారు. వారి అంత్యక్రియలు చేస్తున్న సమయంలోనూ పలువురు స్వల్ప అస్వస్థత చెందారని గ్రామస్థులు తెలిపారు. అనాసమ్మ ఆరోగ్యం నిలకడగా ఉందంటున్నారు. ఈ ఇద్దరు ఎలా మరణించారో తెలియక గ్రామస్థులు అయోమయంలో ఉన్నారు. చిన్నానాటి నుంచి సహదేవ్ భూత వైద్యం, నాటు వైద్యం చేస్తున్నాడన్నారు. వైద్య సిబ్బంది గ్రామానికి వెళ్లి పరీక్షలు చేశారు. గ్రామస్థులంతా ఆరోగ్యంగా ఉన్నారని నిర్ధారించారు. మృతి చెందిన సహదేవ్‌కు భార్య, ముగ్గురు పిల్లలు, త్రినాథ్‌కు భార్య ఒక సంతానం ఉన్నారు.

చుట్టుమెట్ట గ్రామస్థులు అధైర్యపడవద్దు : డీఎంహెచ్‌వో

పెదబయలు మండలం అరడకోట పంచాయతీ చుట్టుమెట్ట గ్రామంలో ఇద్దరు గిరిజనుల దుర్మరణం పట్ల ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా తెలిపారు. గ్రామస్థుల భయాందోళనల నేపథ్యంలో సోమవారం గ్రామంలో సైకియాట్రిస్ట్‌తో పాటు వైద్యుల బృందాలతో గ్రామ ప్రజలకు పరీక్షలు చేస్తామన్నారు. రక్తపోటు, షుగర్, హెచ్‌బీ, సికిల్ సెల్, మలేరియా, నీటి పరీక్షలతోపాటు ఇతర పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అవసరమైన వారికి మందులను అందజేస్తామన్నారు. గ్రామస్థులు అధైర్యపడవలసిన అవసరం లేదన్నారు. గిరిజనులకు సేవ చేయడానికే ఆరోగ్య శాఖ పనిచేస్తుందన్నారు. ఇద్దరి మరణాలకు గల కారణాలపై దర్యాప్తు చేస్తామని ఆయన తెలిపారు.

సంక్షిప్తంగా..

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

» మంత్రి సంధ్యారాణికి శ్రావణ్ విన్నపం



అరకులోయ, జూన్ 23: గిరిజన సంక్షేమ శాఖ గురుకుల ఆశ్రమోన్నత పాఠశాలు, కళాశాలల్లో పదేళ్లుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిడారి శ్రావణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందించినట్టు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నిమార్లు వినతులు ఇచ్చినా పట్టించుకోలేదని వాపోయారు. ప్రస్తుతం పదేళ్లుగా సేవలు అందిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్‌గా చేయాలని కోరినట్టు చెప్పారు. అలాగే టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన రహదారులు, భవనాలు, వంతెనలు పూర్తి చేయాలని మంత్రికి వినతిపత్రం అందించినట్టు శ్రావణ్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ముంచంగిపుట్టు, జూన్ 23: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల నేత వెంగడ నీలకంఠం చెప్పారు. ఈ మేరకు ఆదివారం సంఘం ఆధ్వర్యంలో పాత సుజనకోట గ్రామంలో మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెట్లు అంతరించిపోకుండా ఉండేందుకు, వాటి విత్తనాలను సేకరించి పాడేరు మండలంలోని మినుములూరులో నర్సరీలో పెంచడం జరిగిందన్నారు. ఆ మొక్కలను తీసుకువచ్చి తమ సంఘం ఆధ్వర్యంలో సుజనకోట ప్రాంతంలో వేస్తున్నామని తెలిపారు. భావి తరాలకు ఈ మొక్కలు ఎంతగానో ఉపయోగపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకుడు జి.వీర్రాజు, గ్రామ పెద్దలు ఎస్.శంకరావు, కె.రాధాక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ సెంటర్ భవనం పనులు వేగవంతం చేయండి

డుంబ్రిగుడ, జూన్ 23: మండలంలోని కొర్రాయి పంచాయతీ బురిడివలస గ్రామంలో ప్రధానమంత్రి జన్ మన్ పథకం ద్వారా నిర్మిస్తున్న మల్టీపర్పస్ సెంటర్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సర్పంచ్ పి.కొములునాయుడు కోరారు. గ్రామంలో భవన నిర్మాణాన్ని ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.60 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. భవనం నిర్దేశిత సమయానికి పూర్తిచేయని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వి.జగన్నాథం, అల్లూరి జిల్లా హ్యూమన్ రైట్స్ సభ్యులు విక్రమ్‌దేవ్, వి.రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అధ్వానంగా ఉంటే తెలపండి: ఎంపీడీవో

పాడేరు రూరల్, జూన్ 23: గ్రామాలు, వార్డుల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంటే తక్షణమే మండల పరిషత్ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో కె.సాయినవీన్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మన్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే సమయం ఆసన్నమైన నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. డయేరియా, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలుతుండడంతో ప్రజలు విధిగా ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. కాచి ఒడబోసిన నీటినే తాగాలని, దోమల లార్వాను నిరోధించేందుకు ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వారానికి ఒక రోజు డ్రై డేను పాటించాలని సూచించారు.

ఆశ్రమాల్లో సందేశాత్మక చిత్ర ప్రదర్శన

పాడేరు రూరల్, జూన్ 23: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించే చిత్ర ప్రదర్శనలు చేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం ఉదయం చెక్‌దే ఇండియా చిత్రాన్ని ప్రదర్శించారు. విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన సినిమాలు, క్రీడా పరమైన, దేశ భక్తిని తెలియజేసే చిత్రాలను ప్రదర్శించాలని పీవో సూచించారు.

జీవో -117 రద్దుకు కృషి చేస్తా

» యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

పాడేరు రూరల్, జూన్ 23: ఉపాధ్యాయ పోస్టులు తగ్గించేందుకు తీసుకువచ్చిన జీవో నెంబరు 117ను రద్దు చేయించేందుకు రాష్ట్ర యూనియన్ నుంచి కృషి చేస్తామని యూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్.ప్రసాద్ హామీ ఇచ్చారు. ఆదివారం పాడేరు వచ్చిన ఆయన ఏపీ యూటీఎఫ్ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి జీవో 117 సమస్యను తీసుకువెళ్తామన్నారు. హామీలు అమలు చేయడంలో మాట తప్పని వ్యక్తి లోకేశ్ కావడం వల్ల జీవో 117ను రద్దు చేసేలా కృషి చేస్తామన్నారు. అదే విధంగా అరకు ప్రచారానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ మేరకు గిరిజన ప్రాంతంలో జీవో నెంబరు 3ను రద్దు చేసేందుకు యూనియన్ పరంగా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు వై.విల్సన్‌బాబు, జిల్లా కార్యదర్శి వి.మహేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు వి.చిట్టిబాబు, చీకటి నాగేశ్వరరావు, పి.దేముడు, కె.రఘునాథ్, సీనియర్ నాయకులు సూరిబాబు, రాంబాబు, సనాతనబాబుపాల్గొన్నారు.

కారడవిలో నిలిచిన భద్రాచలం బస్సు

... 3వ పేజీ తరువాయి

ఉండడంతో లోపాలను సరి చేయగలిగారు. లేదంటే ప్రయాణికులు తెల్లవార్లు కారడవిలో ఉండాల్సి వచ్చేది. ఘాట్ రోడ్డులో కండిషన్ ఉన్న బస్సులను నడపాలని గతంలో ఎన్ని పర్యాయాలు కోరినా పీటీడీ అధికారులు డొక్కు బస్సులనే నడుపుతున్నారు. దీంతో అర్ధరాత్రి వేళల్లో అటవీ ప్రాంతంలో బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు అరచేతుల్లో ప్రాణాలను పెట్టుకొని గడుపుతున్నారు. పీటీడీ అధికారులు విశాఖపట్నం-భద్రాచలం సర్వీస్‌కు కొత్త బస్సులను వినియోగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.